క్లుప్తంగా

బకాయిలు ఇప్పించాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: గత అసెంబ్లీ–2023 ఎన్నికల సమయాన వీడియోగ్రఫీ చేసిన బకాయిలను ఇప్పించాలని కోరుతూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు షేక్ హుస్సేన్, చావా సంపత్‌లు విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బకాయిల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఫొటోగ్రఫీ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్, నాయకులు నీరుడు తిరుపతిరావు, దేవర నాగరాజు, మేఘనా శ్రీను, సుధాకర్, బండారు శేషగిరిరావు, కమటం రఘు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

ఖమ్మంగాంధీచౌక్: పేదలకు ప్రయోజనం కలిగేలా లయన్స్ క్లబ్ సేవలను విస్తృతపరుస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు, మమత మెడికల్ కళాశాల ప్రొఫెసర్, హెచ్‌ఓడీ ఆఫ్ న్యూరోసర్జన్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ కె.జగదీష్‌బాబు తెలిపారు. శనివారం నగరంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల చదువులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వృద్ధాశ్రమాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రయోజనాలు సమకూరేలా కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఈ లయన్స్ క్లబ్ కార్యదర్శి దుర్గా నాగేశ్వరరావు, ట్రెజరర్ కృష్ణమూర్తి, డాక్టర్ బీఎస్ రావు, విశ్వేశ్వరరావు, డీపీసీ రావు తదితరులు సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ గాంధీ భవన్‌లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ విస్తరణ కార్యనిర్వాహక సమావేశానికి జిల్లా నుంచి యువజన కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్‌తోపాటు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, కో కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలం

ఖమ్మం మామిళ్లగూడెం: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వీ.రాకేష్ ఆరోపించారు. శనివారం ఖమ్మం రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయని, డ్రగ్స్ మాఫియాపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జాటోత్ ప్రేమ్ సింగ్, సహాయ కార్యదర్శి జిక్కుల భరత్, రాపోలు కృష్ణ, ఉపాధ్యక్షులు సీహెచ్.ధరణ్ కృష్ణ, నాయకులు గోడ్డేటి అశోక్, ఇస్లావత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కిష్కిందాపురి
వినోద	కొత్త లోక, డెమాన్‌స్లాయర్
సాయిరాం	డెమాన్‌స్లాయర్, కొత్తలోక
ఆదిత్య	మిరాయ్
శ్రీనివాస	లిటిల్ హార్ట్స్

– ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	32	బచ్చలికూర	4
వంకాయ	36		20
బెండకాయ	16	పాలకూర	3
పచ్చిమిర్చి	50		20
కాకర	36	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	56	తోటకూర	4
దొండ	40		20
పొట్లకాయ	36	గోంగూర	4
చిక్కుడు	56		20
గోరుచిక్కుడు	36	మెంతికూర	3
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	22		40
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	46		20
బీట్‌రూట్	36	–ఖమ్మం వ్యవసాయం	

సాగు.. సరికొత్తగా!

సండే స్పెషల్

పంటల రక్షణకు వినూత్న ఆలోచనలు

- కోతులను తరిమేలా ప్లాస్టిక్ పైపు గన్స్
- కూలీల కొరతను అధిగమిస్తూ మిర్చి సాగు
- తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న వలువులు

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు ఎన్నో సమస్యలు.. అందులో ఒకటి పక్షులు, కోతులు, పందులు పంట పొలాల్లోని పంటను నాశనం చేస్తుంటాయి. చాలా ప్రాంతాల్లో వీటి బెడద వేధిస్తుండగా.. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అందులో డప్పు శబ్దాలు చేయడం, పులిబొమ్మలు, వివిధ రకాల వేశాలు వేస్తూ, టపాసులు పేల్చడం వంటి పనులు నిత్యం చేస్తుండేవారు. ఈ కష్టాల నుంచి విముక్తి పొందేందుకు రైతులు వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు చేసి మంచి ఫలితాలు సాధిస్తున్నారు. – తిరుమలాయపాలెం

కూలీల ఖర్చులేకుండా..



ఎదుళ్లచెరువులో మిర్చి మొక్కలు నాటేందుకు పైపుతో నీళ్లు పోస్తున్న మహిళా రైతు

మండలంలోని బాలాజీనగర్‌తండాకు చెందిన నరేష్ అనే గిరిజన రైతు ఎదుళ్లచెరువులో భూమిని కౌలుకి తీసుకుని మిర్చి పంట సాగు చేపట్టాడు. మిర్చి మొక్కలు నాటుటకు కూలీల ఖర్చుని తగ్గించుకునేందుకు ఓ ఆలోచన చేశాడు. విద్యుత్ మోటారు నీళ్ల పోసే ప్రాంతంలో ప్రత్యేక దమ్మిని ఏర్పాటు చేసి ఇళ్లల్లో వాడుకునే చిన్న పైపును అమర్చి మిర్చి అచ్చు గుంతల్లో నీళ్ల పడేలా చేసి మొక్కలు నాటించాడు. ఎండలు మండుతున్న తరుణంలో బిందెలతో నీళ్లు పోసే కూలీల ఖర్చులను తగ్గించుకుని పైపు ద్వారా నీరు పెట్టి మిర్చి తోట నాటాడు. ఈ విధానాన్ని చూసిన రైతులు భలే ఐడియా అంటూ కితాబిచ్చారు.



తిరుమలాయపాలెంలో ప్లాస్టిక్ పైపు గన్స్ విక్రయిస్తున్న వెంకన్న

ప్లాస్టిక్ పైపు గన్‌తో కోతులు పరార్..

కోతుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈనేపథ్యాన రైతుల ఇబ్బందులను తొలగించేందుకు సూర్యాపేట జిల్లాకు చెందిన వెంకన్నకు వినూత్న ఆలోచన వచ్చి అతి తక్కువ ఖర్చుతో ప్లాస్టిక్ పైపులు, లైటర్‌తో ప్లాస్టిక్ గన్ ఏర్పాటు చేశాడు. గన్‌లో కాల్షియం కార్బొనేట్ అనే రసాయనాన్ని వేసి అందులో కొంత నీరు పోసి గన్‌కి ఏర్పాటు చేసిన లైటర్ నొక్కితే ఆటంబాంబు లాంటి పెద్ద శబ్దం వస్తుంది. వరి నాటు సందర్భంగా కొంగలు, పత్తి చేలలో వచ్చే కోతుల నుంచి పంటలను రక్షించుకునేందుకు ప్లాస్టిక్ పైపుగన్ ఎంతో ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తిరుమలాయపాలెం ప్రాంతంలో ప్లాస్టిక్ పైపు గన్స్‌ను ఒక్కొక్కటి రూ.350లకు (కార్బైడ్‌తో సహా) అమ్మకాలు చేపట్టగా మంచి స్పందన లభించింది.

యూరియా బస్తాలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కూసుమంచి: రైతులకు యూరియా సరఫరా చేయడంల ప్రభుత్వం విఫలమైందని, జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా యూరియా కష్టాలు తప్పడం లేదని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ విమర్శించారు. పార్టీ ఆధ్వర్యాన యూరియా కొరతపై శనివారం కూసుమంచి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు వరి నాట్లు వేసిన దగ్గర నుంచి యూరియా కోసం చేలల్లో కంటే కేంద్రాల వద్దే ఎక్కువ సమయం గడపాల్సి వస్తుందన్నారు. యూరియాను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ అగ్ర నేతలు సీతారాం ఏచూరీ, చిర్రావూరి లక్ష్మీనర్సయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు మల్లెల సన్మంతరావు, శీలం గురుమూర్తి, ఎడవెల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్, కర్ణబాబు, శ్రీను, వెంగళరావు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓలను సస్పెండ్ చేయాలి

కామేపల్లి: కామేపల్లి రైతు వేదికలో యూరియా కూపన్ల పంపిణీ విషయంలో రైతులపై దురుసుగా వ్యవహరించిన ఏఈఓలపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు జాలె శ్రీనుయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం కామేపల్లిలో ఆయన మాట్లాడుతూ.. యూరియా కూపన్లు అందించాలని కోరిన రైతులను కేసులు పెడతామని బెదిరించడమే కాక, రాయల కృష్ణ అనే రైతుపై అకారణంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఏఈఓలను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. లేకుంటే రైతులందరం కలిసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

బీజేపీ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం/కామేపల్లి: ఈనెల 17న ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా అక్టోబర్ 2 వరకు 15 రోజుల పాటు నిర్వహించాల్సిన సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని బీజేపీ నేతలు పేర్కొన్నారు. శనివారం తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడులో నిర్వహించిన సమావేశంలో యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నలమాస శ్రీనివాస్ మాట్లాడగా, కామేపల్లిలో పార్టీ నాయకుడు భూక్యా శ్రీనునాయక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు, చిత్రాలేఖనం, స్వచ్ఛ భారత్, నమో మారథాన్, దివ్యాంగులకు సన్మానం, మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రికి నివాళులర్పించడం వంటి కార్యక్రమాలను చేయనున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌ను శాలువాతో నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాసరెడ్డి, పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డుపల్లి ప్రసాద్, మల్లెంపాటి బసవయ్య, వేముల వెంకట్, బాలకృష్ణ, భాస్కర్, సురేశ్, కృష్ణ, నల్లగట్టు శ్రీనివాస్, వీరభద్రం సందీప్, శరత్, సంతోష్, మహేష్ తదిదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న కాలనీవాసులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 1, 4వ డివిజన్ల పరిధిలో ఉన్న కై కొండాయిగూడెం, పాండురంగాపురం ప్రాంతాల్లో పలు డివిజన్లకు విస్తరించి ఉన్న విద్యానగర్ కాలనీ సమస్యల పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు శనివారం కాలనీలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసి, హెచ్‌ఎం బండి నరసింహారావు మాట్లాడుతూ.. గత 14 ఏళ్లుగా కాలనీలో రోడ్లు, డ్రైయినేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్, వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వాలు మారుతున్నాయే కానీ సమస్యలు పరిష్కరించబడడం లేదన్నారు. 4వ డివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పాదయాత్రకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు బత్తిన ఉపేంద్ర సంఘీభావం తెలపగా.. కార్యక్రమంలో బానోత్ బాలు నాయక్, జాలాది లెనిన్, గోదా వెంకట నాగమల్లేశ్వరరావు, బండి నాగేంద్ర, వసుంధర, తూము రాంబాబు, రబ్బానీ, జగదీష్, వెంకటేశ్వరరెడ్డి, రేగులగడ్డ రామరావు, బసవ నాగేశ్వరరావు, పద్మ, పద్మారాణి, శ్రీనివాస్, మస్తాన్‌బి, శంకర్రావు, కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నేలకొండపల్లి: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య కోరారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య కార్డులు జారీ చేయాలని కోరారు. డీ.ఏ. పీఆర్‌సీ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడిగా రంగారావు, కార్యదర్శిగా వెంకటేశ్వరరావు నియమితులయ్యారు.

పొంగులేటి ఆర్థిక సాయం..



మునిగేపల్లిలో ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

కూసుమంచి: మండలంలో ఇటీవల మృతిచెందిన పలువురు కుటుంబాలకు పొంగులేటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆర్థిక సాయాన్ని శనివారం నాయకులు పంపిణీ చేశారు. మండలంలోని 25 గ్రామాల్లో మృతుల కుటుంబాలను కలిసి ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున అందించారు. కూసుమంచి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, నాయకులు ఎండీ హఫీజ్, బజ్జూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొని మృతులకు నివాళులర్పించి సాయమందించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



మురళీకృష్ణ, మౌలానాను సన్మానిస్తున్న ట్రస్ట్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ట్ ఆఫ్ లెర్నింగ్ ఇంటర్నేషనల్, అభినందన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. అందులో జిల్లాలోని ముదిగొండ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ అవధానుల మురళీకృష్ణ, కల్లూరు మండలం పేరువంచ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ ఎండీ మౌలానా ఎంపిక కాగా.. వారిని హైదరాబాద్‌లో శనివారం ఘనంగా సన్మానించారు. మాంగళ్య ఫౌండేషన్ బాధ్యులు బత్తిని కీర్తిలతా గౌడ్, ఆర్ట్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు నాదమునుల రామారావు, అభినందన ట్రస్ట్ చైర్మన్ అభినందనలు సన్మానించి అవార్డులు ప్రదానం చేసినట్లు బాధ్యులు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

తిరుమలాయపాలెం: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పాసుకుల సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని జల్లెపల్లి బాలుర హాస్టల్‌ను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పాలేరు డివిజన్ అధ్యక్షుడు గాదె వరుణ్, మండల కమిటీ సభ్యులు రవి, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన కార్మికుల సమ్మె



ధర్నా చేస్తున్న గిరిజన వసతి గృహ కార్మికులు

ఖమ్మంమయూరిసెంటర్: గిరిజన పోస్ట్ మెట్రిక్ వసతిగృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు రూ.15,600 వేతనాన్ని చెల్లించాలని, 60 జీఓ అమలు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం గిరిజన వసతిగృహ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం రెండో రోజుకు చేరింది. రామాలయం రోడ్డులోని గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ముందు ధర్నా నిర్వహించగా.. టీయూసీఐ, ఏఐటీయూసీ మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ.. కార్మికులకు 2020 వరకు రూ.15,600 వేతనం ఇచ్చి ఇప్పుడు తగ్గించడంతోనే కార్మికులు సమ్మెబాట పట్టారన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు ట్రెజరీల ద్వారా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు సీతామహాలక్ష్మి, టీయూసీఐ నగర కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు ఆజాద్, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి యూసీ, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు రాకేష్ భరత్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

రుద్రాక్షల ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రదర్శనలో ఉంచిన రుద్రాక్షలను చూపిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ఆర్ ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో రుద్రాక్షలు, కరుంగళి మాలల ప్రదర్శన ప్రారంభమైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో ఏకముఖి రుద్రాక్ష నుంచి 21 ముఖాల రుద్రాల వరకు లభిస్తాయన్నారు. దక్షిణావృత శంకులు, సాలిగ్రామ్‌లు, తులసిమాలలు, కరుంగళి వెండితో అల్లిన మాలలు, నవరత్న మాలలు, గౌరీశంకర్ రుద్రాక్ష, గణేష్ రుద్రాక్ష, జాతకాలను అనుసరించి రుద్రాక్షలను ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 18 వరకు ఉంటుందన్నారు.

'వైద్యం పేరుతో మోసం చేశారు'

ఖమ్మం మామిళ్లగూడెం: చికిత్స పేరిట ఫీజు వసూలు చేసిన ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం చివరకు తమ కుమారుడి మృతదేహాన్ని ఇచ్చారని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకట్‌తండాకు చెందిన జర్పుల రమేష్ ఆరోపించారు. ఖమ్మంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. తమ కుమారుడు అరవింద్‌కు జ్వరం వస్తుండగా ఓ ఆస్పత్రికి తీసుకురాగా ఐసీయూలో చేర్చుకుని చివరకు కోమాలోకి వెళ్లినట్లు చెప్పారన్నారు. అతర్వాత రూ.లక్షల్లో ఫీజు తీసుకుని అంబులెన్స్‌లో తమ గ్రామానికి వెళ్లే మార్గానికి తీసుకొచ్చారని తెలిపారు. అక్కడ అరవింద్ చనిపోయాడని చెబుతూ పంపించారని వాపోయారు. ఆపై తమపై నిందలు వేస్తున్నందున ఖమ్మం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రమేష్ తెలిపారు. అరవింద్ తల్లి ఆదిలక్ష్మితో పాటు చందులాల్, కోటేష్, ఎన్.రవి, కిషన్ నాయక్, సిరి, రవి, బాలాజీ పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలను ఖమ్మం జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యాలయంలో వేడుకలు నిర్వహించగా.. బీసీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పిండిప్రోలు రామమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రుద్ర ప్రదీప్, అనుముల సోమయ్య, చెన్నోజు పుల్లయ్య, రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నేలకొండపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సాదాబైనామా క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందని పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ చట్టం వల్ల సన్న, చిన్న కారు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 15, 16వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న దోస్త్ పోర్టల్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థుల వివరాలను అప్లోడ్ చేయనున్నట్లు తెలిపారు.మిగిలిన సీట్ల కోసం 18, 19 తేదిలలో వన్‌టైన్ స్పెషల్ స్పాట్ అడ్మిషన్ రౌండ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో నేరుగా ఆయా డిగ్రీ కళాశాలను సంప్రదించాలని, మరిన్ని వివరాలకు కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్లను సంప్రదించాలని సూచించారు.

సిద్ధాంతకర్త 'ఏచూరి'



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంఅర్బన్: మార్క్సిజాన్ని భారతదేశ పరిస్థితులకు అన్వయించి ముందుకు నడిపించిన సిద్ధాంతకర్త సీతారాం ఏచూరి అని ఖమ్మం సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ పేర్కొన్నారు. శనివారం ఖానాపురం హవేలీ కేంద్రంగా సీపీఎం ఆధ్వర్యాన నిర్వహించిన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాల ద్వారా ఆయన ఆశయాలను సాధించడమే మనమిచ్చే ఘనమైన నివాళి అవుతుందని ఆయన సేవలను కొనియాడారు. హవేలీ మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో హవేలీ కార్యాదర్శి దొంగల తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు పిన్నింటి రమ్య, డివిజన్ కమిటీ సభ్యులు గాలి వెంకటాద్రి, పోతురాజు వెంకటి, మండల నాయకులు జట్ల ఆనందరావు, గాలి అంజయ్య, తిప్పర్తి నరసింహారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'చిర్రవూరి' జీవితం ఆదర్శనీయం



జోహార్లు అర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్రవూరి లక్ష్మీనర్సయ్య జీవితం నేటి ప్రజాప్రతినిధులకు ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శనివారం రైల్వేస్టేషన్ సమీపంలోని ఆయన స్తూపం వద్ద 17వ వర్ధంతి సభ నిర్వహించగా.. ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో చిర్రవూరి పాత్ర మరువలేనిదని ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, ఎంఏ జబ్బర్, దొంగల తిరుపతిరావు, నవీన్‌రెడ్డి, మెరుగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'రాయప్రోలు' సంతాప సభ

ఖమ్మం అర్బన్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఉద్యమంలో చెరగని ముద్ర వేసిన రాయప్రోలు నాగేశ్వరరావు సంతాప సభను నగరంలో శనివారం ఖమ్మం అర్బన్ మండల శాఖ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.మనోహర్‌రాజు మాట్లాడుతూ.. విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, టీపీటీఎఫ్ నాయకుడిగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎన్నో సేవలు అందించిన ఆయన జీవితం ఉపాధ్యాయులకు ఆదర్శమన్నారు. జిల్లా కార్యదర్శి ఎం.నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభ సంస్థ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.విజయ్, వై.పద్మ, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల అశోక్, పీవైఎల్ నాయకుడు సీ.వై.పుల్లయ్య, అకాడమిక్ సెల్ మాజీ కన్వీనర్ ఆళ్ల రామారావు, తిరుమల్, జిల్లా నాయకులు ఏ.వీ.నాగేశ్వరరావు, టి.వెంగళరావు, ఎం.ఉమాదేవి, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

జర చూసి వెళ్లండి..



దెబ్బతిన్న రోడ్డు, డ్రెయినేజీ మూత

నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం నుంచి జీకే బజార్‌కు వెళ్లే దారిలో మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. డ్రెయినేజీ కాల్వపై వేసిన మూత పాడై అధ్వానంగా మారింది. పక్కన రోడ్డు పగలడంతో రాళ్లు, మట్టి కప్పారు. ఈ క్రమంలో అటువైపుగా వెళ్లే సమయాన అప్రమత్తం లేకపోతే ఇక అంతే సంగతి. రాత్రి సమయాల్లో మరింత జాగ్రత్తగా వెళ్లాల్సిందే మరి. – ఖమ్మంమామిళ్లగూడెం